క్లుప్తంగా

అంకాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



పెనమలూరు: పెనమలూరులో అంకాలమ్మ తల్లికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. నాయీబ్రాహ్మణుల కులదేవత అంకాలమ్మ తల్లికి గంగూరు, పోరంకికి చెందిన భక్తులు శ్రావణమాసం సందర్భంగా ఊరేగింపుగా వెళ్లి పెనమలూరులో వేంచేసి ఉన్న అంకాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతీయ నాయీబ్రాహ్మణ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆకునూరు సుబ్బారావు మాట్లాడుతూ గ్రామాల ప్రజలు సుఖసంతోషాలతో, రైతులు పాడి పంటలతో సంమృద్ధిగా ఉండాలని పూజలు చేశామన్నారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘ నేతలు ఆకునూరు బసవరాజు, ఇంటూరి మురళీకృష్ణ, మద్దిరల వెంకటసుబ్బారావు, ఆకునూరు శ్రీనివాసరావు, పరస బాలకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజా సమస్యల ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బీఎల్వీ శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను కార్యక్రమంలో పాల్గొనే అధికారుల దృష్టికి వినతి పత్రం ద్వారా తెలియజేసి పరిష్కరించుకోవచ్చునని సూచించారు.

ప్రైవేటు ఆస్పత్రులు సమాజ సేవ చేయాలి



పెనమలూరు: ప్రైవేటు ఆస్పత్రులు సమాజ సేవపై దృష్టి పెట్టాలని విజయవాడ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. కానూరు తులసీనగర్‌లో ఆదివారం డాక్టర్ యోగితా చెన్నుపాటి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆరుష్ రెమటాలజీ, ఇమ్యునాలజీ ఆస్పత్రిని ఆయన ప్రారంభించారు. ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందించాలని కోరారు. సమాజంలో ప్రతీ ఒక్కరికి వైద్య సేవలు అందుబాటులో ఉండే విధంగా వైద్యులు సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, విజయవాడ ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ప్రమోద్ చలసాని, కార్యదర్శి డాక్టర్ శివరామ్ అక్కినేని పాల్గొన్నారు.

సురక్షిత తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు

రామవరప్పాడు: గ్రామంలో సురక్షిత తాగునీటి సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు తెలిపారు. విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులో ఆదివారం తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులు నిర్వహించి వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన గ్రామంతో పాటు కాల్వగట్టు ప్రాంతాల్లో సురక్షిత తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో మోటారు బోర్లతో పాటు కొత్తగా వాటర్ ట్యాంకుల ద్వారా కూడా తాగునీటిని అందిస్తున్నామని వివరించారు. అలాగే వాటర్ పైప్‌లైన్ విస్తరణ పనులు నిర్వహిస్తున్నామని చెప్పారు. రెండు నూతన వాటర్ ట్యాంకుల నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. అతి త్వరలో వీటిని ప్రారంభోత్సవం చేస్తామని పేర్కొన్నారు.

స్పీడ్ బ్రేకర్ తొలగింపుపై వివాదం

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కొత్త మల్లివల్లి గ్రామంలోని అంతర్గత సీసీ రోడ్డుపై నిర్మించిన స్పీడ్ బ్రేకర్ తొలగింపు ఇరువర్గాల మధ్య వివాదానికి దారి తీసింది. దీంతో పరస్పరం దాడికి పాల్పడటంతో పాటు ఇరువర్గాలు ఒకరిపై ఒకరు వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. స్పీడ్ బ్రేకర్‌ను గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా దౌర్జన్యంగా తొలగించడంపై మహ్మద్ రఫీ, మరికొందరు ప్రశ్నించడంతో వివాదం ఏర్పడింది. దీంతో గ్రామంలో ఇరువర్గాలు పరస్పరం దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో గాయపడిన మహ్మద్ రఫీ చికిత్స నిమిత్తం నూజివీడు ప్రభుత్వాసుపత్రిలో చేరాడు. కాగా షేక్ జామురీన్, మహ్మద్ రఫీలు వేర్వేరుగా ఇచ్చిన ఫిర్యాదులపై వీరవల్లి పోలీసులు కౌంటర్ కేసులు నమోదు చేశారు.

బాబా సింహాసనానికి వెండి వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో బాబావారి వెండి సింహాసనం నిమిత్తం ఆదివారం దాత చేవూరి విజయ రూ. లక్ష విలువైన 1,250 గ్రాముల వెండిని మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాత చేవూరి విజయ మాట్లాడుతూ.. ఎంతో మహిమాన్వితమైన మందిరంలో బాబావారి సింహాసనానికి వెండిని అందజేస్తున్నట్లు తెలిపారు. దాత చేవూరి విజయను బాబావారి శేషవస్త్రంతో సత్కరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు బాబావారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



పోరంకిలో కాలనీ నుంచి వచ్చిన మురుగునీరు



మురుగునీటిలో పశుగ్రాసం



లక్ష్మీపురం కాలనీ నుంచి తవ్విన డ్రెయిన్ ఇదే

ముంచేస్తున్న మురుగునీరు

- పోరంకిలో మున్సిపాలిటీ నిర్వాకం
- ఇళ్లల్లోకి చేరుతున్న మురుగునీరు
- మూగ జీవాలకు పశుగ్రాసం కొరత

పెనమలూరు: కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్లు ఉంది తాడిగడప మున్సిపాలిటీ అధికారుల పనితీరు. పోరంకి లక్ష్మీపురం కాలనీలో మురుగునీటి సమస్య ఉంది. దీనిని నివారించడానికి డ్రెయిన్ తవ్వి కాలనీ బయట ఉన్న నివాసాలపై వదలడంతో మురుగునీరు విలయ తాండవం చేస్తోంది. దీంతో స్థానికులు మురుగునీటితో గగ్గోలు పెడుతున్నా అధికారుల్లో స్పందన లేదు. వివరాల్లోకి వెళితే.. పోరంకిలో లక్ష్మీపురం కాలనీ ఉంది. ఈ కాలనీలో భూగర్భ డ్రెయినేజీ ఉంది. అయితే కాలనీలో నీరు భూగర్భ డ్రెయినేజీ నుంచి బయటకు పోవడం లేదని తాడిగడప మున్సిపాలిటీ అధికారులకు ఫిర్యాదులు అందాయి. అయితే అధికారులు సమస్య ఎక్కడ ఉందో గుర్తించి పరిష్కరించాల్సింది పోయి కొత్త సమస్య సృష్టించారు. లక్ష్మీపురం కాలనీ నుంచి బందరు రోడ్డు వైపునకు జేసీబీతో కాలువ తవ్వించారు. ఆ కాలువలోకి మురుగునీరు వదిలారు. అయితే కాలువలోకి వచ్చే మురుగునీరు బందరు రోడ్డు పక్కన ఉన్న డ్రెయినేజీ వరకు వెళ్లడంలేదు. కాలువ మెరకగా ఉండటంతో డ్రెయినేజీలోకి వచ్చే మురుగునీరు కాలనీ బయట ఉన్న ఇళ్లల్లోకి వెళుతుంది. వర్షం చినుకు పడితే మోకాటి లోతు మురుగునీరు ఇళ్లల్లోకి చేరుతుంది. పక్కనే ఉన్న పశుగ్రాసం సాగు జరిగే దాదాపు 4 ఎకరాల పొలాల్లో కూడా మురుగునీరు ఉండిపోతుంది.

ఆందోళనలో స్థానికులు

లక్ష్మీపురం కాలనీ నుంచి వచ్చే మురుగునీరు కాలనీ బయటకు రాకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మురుగునీరు ఇళ్లపై పడటంతో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నివాసితులతో పాటు పశువులు, సాగు జీవాలు నీటిలో మునిగి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశుగ్రాసం సైతం మురుగునీటిలో మునిగిపోవడంతో పశువులకు మేత కూడా లేకుండా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ నుంచి వచ్చే డ్రెయినేజీని ఆపాలని కోరుతున్నారు. గతంలో కాలనీ డ్రెయినేజీ నీరు మరో వైపు పారుదల ఉండేదని ఇప్పుడు కూడా అటువైపే మళ్లించాలని కోరుతున్నారు. వర్షం పడితే మురుగునీరు విలయ తాండవం చేస్తుందని వాపోతున్నారు.

అధికారులు స్పందించాలి



కాలనీలో మురుగునీరు మా ఇళ్లపైకి మళ్లించడం దారుణం. పక్కా డ్రెయినేజీ లేకుండా మురుగునీరు మళ్లించడంతో మా ఇళ్లు అందులో మునుగుతున్నాయి. అధికారులకు ఫిర్యాదు చేసినా చలనం లేదు. పరిస్థితులు ఇలాగే ఉంటే డ్రెయినేజీకి అడ్డుకట్టు వేస్తాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– తోటకూర త్రినాథ్, పోరంకి

పేకాటకు అడ్డాగా పోరంకి

పెనమలూరు: పోరంకి పేకాట అడ్డాగా విస్తరించింది. గతంలో మండల శివారు ప్రాంతాల్లో పేకాట శిబిరాలు నడిచేవి. తాజాగా టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోరంకి కేంద్రంగా పేకాట మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. టీడీపీ అనుకూలంగా ఉండే కొందరు పేకాట నిర్వాహకులు ఏకంగా అపార్టుమెంట్‌ల్లో ఫ్లాట్‌లు తీసుకొని శిబిరాలు నిర్వహిస్తున్నారు. పోరంకిలోని శ్రావణ్ ఎన్‌క్లేవ్ అపార్టుమెంట్‌లో పేకాట జోరుగా సాగుతోందన్న సమాచారంతో టాస్కుఫోర్స్ పోలీసులు దాడులు చేసి కోతముక్క ఆడుతున్న 16 మందిని అరెస్టు చేసి వారి వద్ద రూ. 2 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పేకాట శిబిరాలు నివాసాల ప్రాంతాల్లో వెలుస్తున్నాయని చెప్పడానికి ఈ ఘటన నిదర్శనంగా ఉంది. పేకాట శిబిరాలపై దాడి చేసిన సమయంలో స్వాధీనం చేసుకునే సొమ్ములో కూడా లెక్కతప్పుతోందని పోలీసులకు చిక్కిన నిందితులే బహిరంగంగా చెబుతున్నారు.

ఆధిపత్య పోరు..

పేకాట శిబిరాల నిర్వహణలో టీడీపీ వర్గాల్లో ఆధిపత్య పోరుసాగుతుందని సమాచారం. పోరంకిలో పేకాట శిబిరంపై దాడి చేయడానికి మరో పేకాట శిబిరం నిర్వహిస్తున్న వ్యక్తే కారణమని చెబుతున్నారు. ఆ వ్యక్తికి టీడీపీ ముఖ్య నేత అండదండలు ఉన్నాయని గుసగుసలు వినబడుతున్నాయి. పేకాట శిబిరాలు నిర్వహించే వ్యక్తుల వివరాలు పెనమలూరు పోలీసుల వద్ద ఉన్నా అధికార పార్టీ అండదండలు ఉండటంతో వారు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పెనమలూరు పోలీసుల వైఖరి ఇలానే ఉంటే ఇక పేకాట శిబిరాలు ఎక్కడపడితే అక్కడ వెలిసే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

అవయవదానానికి అంగీకారం



అల్లూరి రామరాజు

ఉంగుటూరు: ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఆదివారం జరిగిన ఉచిత వైద్య శిబిరానికి హాజరైన ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామానికి చెందిన అల్లూరి రామరాజు(75) అవయవ దానం చేసేందుకు ముందుకు వచ్చారు. మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అభిమానంతో ఆయనకు గుర్తుగా ఎన్టీఆర్ ట్రస్ట్ క్యాన్సర్ ఆసుపత్రికి అవయవ దానం చేసేందుకు నిర్ణయం తీసుకున్నానని రామరాజు మాజీ ఉప రాష్ట్రపతికి తెలిపారు. ఈ విషయంలో ఎంతో మందికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన రామరాజును వెంకయ్యనాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

ఆత్కూరు ఎస్ఐగా సురేష్



ఉంగుటూరు: ఆత్కూరు పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా చావ సురేష్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా తూర్పు గోదావరి జిల్లా నుంచి ఆత్కూరుకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఎస్ఐగా విధులు నిర్వహించిన పైడి బాబు కృత్తివెన్ను మండలం బదిలీ అయ్యారు.

353 మందికి వైద్య పరీక్షలు

ఉంగుటూరు: మండలంలోని ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో గుడివాడ ఈవీఆర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో రోగులను పలకరించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వెంకయ్యనాయుడు సూచించారు. గుండె, మెదడు, నరాలు, క్యాన్సర్, ఉదర కోశ వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో 353 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, రూ. 50వేలు విలువ గల మందులు పంపిణీ చేశామని నిర్వాహకులు తెలిపారు.



ఆత్కూరులో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

వివిధ విభాగాల వైద్య నిపుణులు ఈడ్పుగంటి రాజ్యలక్ష్మి, రాజేంద్ర, రేవంత్ కుమార్, అమృత కొండపల్లి, రఘువర్మ మన్నేం, సుమన్ కుమార్, జయశ్రీ సూరపనేని, గౌతమి, ప్రశాంతి, నీలిమ, అనూష, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డ్రెయినేజీపై చప్టా

- పట్టించుకోని అధికారులు
- ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసిన వైనం



రైతుబజారు ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన హోటల్ వద్ద డ్రెయినేజీపై శాశ్వత చప్టా

కంకిపాడు: డ్రెయినేజీపై చిరు వ్యాపారులు వారి వ్యాపారాలు సాగిస్తేనే అధికారులు ఓర్వలేరు. ఆక్రమణలు చేస్తారా? అంటూ విరుచుకుపడిపోతారు. అదే అధికార పార్టీ వత్తాసు ఉంటే కనీసం ఆ వైపు కూడా చూడరు. ఇదే జరిగింది కంకిపాడులో. ఓ హోటల్ నిర్వాహకుడు డ్రెయినేజీపై శాశ్వతంగా చప్టాను నిర్మించాడు. అధికారులు శాశ్వత చప్టా నిర్మాణ పనులు జరిగినా చోద్యం చూస్తున్నారు. వివరాల్లోకి వెళితే... పట్టణంలోని రైతుబజారు ఎదురుగా ఓ భవనంలో నూతనంగా హోటల్ ఏర్పాటైంది. ఈనెల 10వ తేదీన ఈ హోటల్‌ను అధికారికంగా ప్రారంభించారు. ఈ క్రమంలో హోటల్ నిర్వాహకులు తమ వ్యాపార అవసరాలకు అనుగుణంగా డ్రెయినేజీపై ఏర్పాట్లు చేసుకున్నారు. భవన యజమాని తదనుగుణంగా నిర్మాణాలు చేయించారు. హోటల్ వెలుపల డ్రెయినేజీపై రెండు చిరు దుకాణాలను సైతం ఏర్పాటుచేసి అదనపు వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నారు.

వ్యర్థాలు అన్ని డ్రెయినేజీలోకే..

సాధారణంగా డ్రెయినేజీపై వ్యాపారాలు నిర్వహించినా, శాశ్వత చప్టాలు కట్టినా అధికారులు ఊరుకోరు. అలాంటిది ఇక్కడ శాశ్వత చప్టా నిర్మాణం, చిరు దుకాణాలు వెలిశాయి. హోటల్, చిరు దుకాణాల నుంచి వెలువడే వ్యర్థాలు అన్నింటినీ డ్రెయినేజీలోకి పంపుతున్నారు. ఇంతవరకూ బాగానే ఉన్నా డ్రెయినేజీల్లో తరచూ పూడిక తీయాల్సిన పరిస్థితి ఉంది. కానీ ఈ శాశ్వత చప్టా నిర్మాణంతో ఆ ప్రాంతంలో పేరుకున్న వ్యర్థాలను తొలగించేందుకు ఆస్కారం లేకుండా పోతుంది. దీని వల్ల దోమల వ్యాప్తి అధికంగా ఉంటుంది. ప్రజారోగ్యానికి భద్రత లేకుండా పోతుంది. ఇంత తెలిసీ డ్రెయినేజీ పూడికతీత పనులకు ఆటంకం లేకుండా చప్టా నిర్మాణం, అవసరమైన చోట్ల డ్రిల్స్ పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయకుండా వ్యవహరిస్తున్నా నిర్లక్ష్యం ప్రదర్శించడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

కరాటేతో విద్యార్థులకు ఆత్మ రక్షణ



పాయకాపురం(విజయవాడరూరల్): కరాటేతో విద్యార్థులకు ఆత్మ రక్షణ కలుగుతుందని శారదా స్కూల్ కన్వీనర్, అనంతలక్ష్మీదేవి సేవా సంఘం అధ్యక్షుడు పెనుమత్స అప్పలరాజు అన్నారు. పాయకాపురం శారద స్కూల్ నందు ఓకినవా వెపన్స్ ట్రైనింగ్ అకాడమీ కోచ్ బల్లం కిషోర్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు కరాటేలో నాంచాక్ ట్రైనింగ్ క్యాంప్ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అప్పలరాజు మాట్లాడుతూ.. నాంచాక్ ట్రైనింగ్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు అద్భుత ప్రతిభ ప్రదర్శించారన్నారు. ట్రైనింగ్ ఇచ్చిన కోచ్ బల్లం కిషోర్‌ని అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మరో కోచ్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక కళాకారులతో గజ్జ పూజ

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన కూచిపూడి నాట్య సంప్రదాయంలో ప్రధాన అంశమైన గజ్జ పూజను ఔత్సాహిక కళాకారులైన చిన్నారులతో ఘనంగా నిర్వహించారు. విద్యాధరపురంలోని శ్రీవాగ్దేవి కూచిపూడి నృత్యాలయ ఆధ్వర్యంలో నాట్యాచార్యులు సప్పా శివకుమార్, ధనలక్ష్మి నేతృత్వంలో ఆదివారం చిన్నారులతో పూజాదికాలు చేయించారు. అనంతరం వారికి ఆయన మువ్వల గజ్జలను అందజేశారు. ఈ సందర్భంగా పలు సంప్రదాయ కీర్తనలకు వారి చేత నర్తింప చేయగా నేరెళ్ల ఫణికుమార్(మృదంగం), వనమాలి(వేణువు) వాయిద్య సహకారం అందించారు. నాట్యాచార్యుడు సప్పా శివకుమార్ మాట్లాడుతూ భారతీయ శాస్త్రీయ నృత్య కళాకారిణి జీవితంలో అత్యంత ముఖ్యమైన ఘట్టాలలో గజ్జ పూజ ఒకటని తెలిపారు. నర్తకి నటరాజు భగవానుడు ఆ తర్వాత గురువు నుంచి ఆశీర్వాదం కోరుతుందన్నారు. అనంతరం ఆమె గజ్జలను ధరించే ముందు వాటిని ప్రార్థిస్తూ మంచి కళాకారిణిగా గుర్తింపు పొందాలని కోరుకుంటుందని చెప్పారు. నాట్యం చేసేటప్పుడు కాలికి ఉన్న గజ్జ ఘల్లు..ఘల్లు మంటుంటే ఆ నర్తకి మనసు ఉప్పొంగి నాట్యం చేస్తుందని పేర్కొన్నారు.



నాట్యం చేస్తున్న చిన్నారులు

కామర్స్ టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతుల పంపిణీ



కృష్ణలంక(విజయవాడతూర్పు): ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విజయవాడ చాప్టర్ నిర్వహించిన కామర్స్ టాలెంట్ హంట్ – 2024లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో విజయవాడ, కృష్ణాజిల్లాలోని స్కూల్స్‌లో చదివే పదో తరగతి విద్యార్థులకు, ఇంటర్మీడియెట్, డిగ్రీ చదివే కాలేజీ విద్యార్థులకు ఆదివారం కామర్స్ టాలెంట్ హంట్ – 2024 నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్‌లో ప్రముఖ కాలేజీల నుంచి పెద్ద సంఖ్యలో జూనియర్, సీనియర్ ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరం చదివే విద్యార్థులు పాల్గొన్నారు. ఈ టెస్ట్ ద్వారా విద్యార్థులందరూ కామర్స్‌లో తమకు ఉన్న పట్టు, ప్రతిభ నిరూపించుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ. 10 వేలు, రెండో, మూడు, నాల్గవ బహుమతులుగా రూ.5 వేలు, రూ. 2,500, రూ. 1000 నగదు అందజేశారు. అనంతరం టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న ప్రతి విద్యార్థికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో విజయవాడ చాప్టర్ సెక్రటరీ సుంకర పూర్ణిమ, పొన్నగంటి వినయరంజన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వ్యక్తీ సమాజాన్ని గౌరవించాలి

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



పోరంకిలో ప్రసంగిస్తున్న వెంకయ్యనాయుడు

పెనమలూరు: ప్రతి వ్యక్తీ నీతి నిజాయితీతో సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. పోరంకిలో ఆదివారం ఒక కల్యాణ మండపంలో వెంకయ్యనాయుడు 50 సంవత్సరాల ప్రజాజీవనంలో అలుపెరగని పయణం, 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగిన ఆత్మీయ సంగమ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నిబద్ధత, క్రమశిక్షణతో రాజకీయాల్లో ఉండి ఉదయగిరి నుంచి ఉపరాష్ట్రపతి పదవి అలంకరించానన్నారు. రాజకీయాలే కాకుండా నిజ జీవితంలో కూడా నాయకులు చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. ప్రతీ నాయకుడు చట్టసభలను గౌరవించాలని, ధిక్కార స్వరంతో ఉండే నేతలు మనుగడ సాధించలేరన్నారు. కుటుంబ విలువలు, తల్లిదండ్రుల పట్ల ఆదరణ ఉండాలని సూచించారు. రాజకీయాల్లో అనేక ఆటుపోట్లు ఎదురైనా రాజకీయాల్లో సంతృప్తికరంగా గడిపానని వివరించారు. కార్యక్రమంలో మంత్రులు కొలుసు పార్థసారథి, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, కామినేని శ్రీనివాస్, యార్లగడ్డ వెంకట్రావు, వసంత కృష్ణప్రసాద్, మండల బుద్ధప్రసాద్, బోడె ప్రసాద్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

పురుషోత్తపట్నం గ్రామ సచివాలయం ప్రారంభం



నూతన సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం రూరల్: మండలంలోని పురుషోత్తపట్నం గ్రామంలో ఉపాధి హామీ పథకం నిధులు రూ. 43.6 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ సచివాలయ భవనాన్ని ఆదివారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. సర్పంచ్ మాదల రోహిణి అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలన తీసుకువచ్చి గ్రామాల్లో సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసి బలోపేతం చేస్తుందన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో అంతర్గత రోడ్లను సిమెంట్ రోడ్లుగా నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పోలవరం కాలువ నీటిని రైతులకు అందించేందుకు తన సొంత నిధులు వెచ్చించి మోటార్లు కొనుగోలు చేసి ఇచ్చానని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డను గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర కిషాన్ మోర్చా అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, నల్లూరు వెంకటరత్నం, జూపల్లి సురేష్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శి కోట సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణం పూర్తి ఎప్పుడో..!



కొత్తగూడెం వద్ద పోలవరం కాలువపై అసంపూర్తిగా ఉన్న వంతెన నిర్మాణం

గన్నవరం రూరల్: మండలంలోని కొత్తగూడెం వద్ద పోలవరం కాలువపై వంతెన నిర్మించాలని ఆ గ్రామస్తులు ఎంతో కాలంగా కోరుతున్నారు. పోలవరం కాలువ తవ్వకం, నిర్మాణ సమయంలో కొత్తగూడెం వద్ద వంతెన నిర్మాణం చేయకపోవడంతో ఆ గ్రామస్తులు ఎన్నో అవస్థలను ఎదుర్కొంటున్నారు. గ్రామంలో వెయ్యికి పైగా జనాభా ఉన్నారు. పశువులు, గొర్రెలు, మేకలు, వ్యవసాయం ప్రధాన జీవనాధారంగా ఇక్కడ రైతులు ఉన్నారు. వీరందరికి పోలవరం కాలువ అవతల వైపు సుమారుగా 500 ఎకరాలు వరకూ పంట భూములు ఉన్నాయి. పశువులను మేపుకొనేందుకు చిక్కవరం వద్ద పోలవరం కాలువ దాటి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో నాలుగు కిలో మీటర్లు పైగా చుట్టూ తిరిగి రావాల్సి వస్తోందని రైతాంగం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలవరం కాలువ నిర్మాణం పూర్తయిన తర్వాత గ్రామస్తుల వినతి మేరకు కొత్తగూడెం వద్ద వంతెన నిర్మాణం చేపట్టారు. అయితే ఆ నిర్మాణం పూర్తి కాకపోవడంతో రైతాంగం అవస్థలు అదేవిధంగా కొనసాగుతున్నాయి. పోలవరం ఉన్నతాధికారులు పరిశీలించి కొత్తగూడెం వద్ద వంతెన నిర్మాణం పూర్తి చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏటిపాయలో వరద తగ్గుముఖం



కాసరనేనివారిపాలెం వద్ద నాలుగు అడుగులు వెనక్కి వెళ్లిన ఏటిపాయ

కంకిపాడు: ఏటిపాయలో వరదనీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు, వరదనీటి ఉధృతి తగ్గడంతో ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు నీటి విడుదల తగ్గింది. నిన్నటి వరకూ ఉధృతంగా సాగిన వరదనీటి ప్రవాహం తగ్గింది. మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం వద్ద ఏటిపాయ ఆదివారం నాలుగు అడుగుల మేర వెనక్కి వెళ్లింది. ఏటిపాయ అంచులు తాకుతూ వరదనీరు ప్రవహిస్తోంది. వరదనీటి ఉధృతి తగ్గినా ఇంకా ఏటిపాయలోకి వెళ్లే మార్గం బయటపడకపోవడంతో రాకపోకలు పునరుద్ధరణ కాలేదు. దీంతో రెవిన్యూ అధికారులు ఏటిపాయలోకి పశువులు, గొర్రెల కాపరులు, రైతులు, కూలీలు వెళ్లకుండా బందోబస్తు చర్యలు కొనసాగిస్తున్నారు. మైక్‌ల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఏటిపాయలో వరదనీటి కారణంగా నాలుగు రోజులుగా మత్స్యకారులు చేపల వేటకు వెళ్లడం లేదు. పడవలను ఒడ్డుకు చేర్చి లంగరు వేశారు. వేటకు వెళ్లకపోవడంతో మత్స్యకారులకు ఉపాధి కరువైంది. ఏటిపాయలో నీటి ఉధృతి ఎప్పుడు పూర్తి స్థాయిలో తగ్గుతుందా.?, వేటకు ఎప్పుడు వెళ్లాలా.? అన్న ఆలోచనలో మత్స్యకారులు ఉన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన శ్రీ శ్రావ్య నర్తన కూచిపూడి నృత్యాలయానికి చెందిన చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. ఆదివారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ధర్మపథం వేదికపై చిన్నారులు పలు కీర్తనలకు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. అమ్మవారి దర్శనం అనంతరం రాజగోపురం వద్దకు చేరుకున్న భక్తులు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యానికి మంత్రముగ్ధులై ప్రదర్శనను ఆద్యంతం ఎంతో ఆసక్తితో వీక్షించారు. నృత్య ప్రదర్శన అనంతరం చిన్నారులకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు తీర్థప్రసాదాలను అందజేశారు.